ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం

- కార్యకర్తలకు అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు
- రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు
- ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం
- కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో, రాష్ట్రంలో ప్రజలు ఇచ్చిన తీర్పును తాను గౌరవిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. తాము వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలోని కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై రాష్ట్రంలో ఎప్పుడూ జరగని విధంగా దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విఘాతమని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు కత్తిమీద సాములాంటివన్నారు. ఆ హామీలను నెరవేర్చాలంటే రాష్ట్ర ఖజానాలో ఉన్న మొత్తం డబ్బులు ఒక సంవత్సరానికి కూడా సరిపోవన్నారు. అలాంటి పథకాలు ఎలా నెరవేరుస్తారో వేచి చూడాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, విద్యుత్ చార్జీలు పెరిగాయని, ఇలా పలు ఆరోపణలు చేస్తూ ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అయితే ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే ప్రతి ప్రభుత్వానికి సమయం ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆరు నెలలపాటు ఓపికగా ఉంటే ఆ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందో లేదో స్పష్టంగా తెలుస్తుందన్నారు. ప్రతిఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో లేదని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి వచ్చే ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవించాలన్నారు. ప్రజలు ఏ పార్టీకి పట్టంగడితే ఆ పార్టీ అధికారంలో ఉంటుందని చెప్పారు. సాధారణంగా శ్రీశైలం నియోజకవర్గంలో ఎన్నడూ కూడా ఎన్నికల అనంతరం దాడులు జరగలేదని, ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను నడి రోడ్డుపై పరిగెత్తించి దాడులు చేయడం సరికాదన్నారు. పట్టణంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పువ్వాడ భాస్కర్‌పై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. పట్టణంలో ఆర్యవైశ్యులు సౌమ్యులని, అలాంటి వారిపై దాడులు తగవన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ఎవరిపై దాడులు చేయలేదని, ఎందరో టీడీపీ కార్యకర్తలు వివిధ పనుల కోసం వస్తే తాము పనులు చేసి వారికి కూడా సాయం చేశామన్నారు. ఎమ్మెల్యేగా బుడ్డా రాజశేఖర్‌రెడ్డి గెలిచారని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తామని పేర్కొనడం సరికాదన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేయాలి

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నియోజకవర్గంలో మెరుగైన పాలన అందించి, అభివృద్ధి కోసం కృషి చేస్తే ప్రతిఒక్కరూ హర్షిస్తారని శిల్పా అన్నారు. అభివృద్ధి చేస్తే తాము కూడా సంతోషిస్తామన్నారు. వారిపై దాడి చేయండి, వీరిపై దాడి చేయాలని గెలిచిన ఎమ్మెల్యే సూచించడం శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుందన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు అభివృద్ధి వైపు చూడాలని, గొడవలకు పోరాదన్నారు. కొద్ది రోజులపాటు కార్యకర్తలు సంయమనంతో వ్యవహరిస్తే ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణాధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, అహ్మద్‌హుసేన్, వెంకటస్వామిగౌడ్, శివశంకర్‌నాయక్, హనుమంతరెడ్డి, లక్ష్మిరెడ్డి, బాలస్వామియాదవ్, బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా, పార్వతి, షఫీఉస్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

వెలుగోడు: ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏమాత్రం అధైర్య పడొద్దని, తాను అండగా ఉంటానని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భరోసా కల్పించారు. స్థానిక కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. టీడీపీ ఇచ్చిన హామీలు నెరవేర్చడం కష్టసాధ్యమన్నారు. నెరవేర్చలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. నియోజకవర్గంలోని నాయకులకు, కార్యకర్తలకు ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తామని, టీడీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తే సహకరిస్తామని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై అనుమానాలు ఉన్నాయని, వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీకి మెజారిటీ రావడం అనుమానాలకు తావిస్తుందన్నారు. దాడులు చేయడం సరికాదని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఇలియాస్ ఖాన్, దేశం తిరుపంరెడ్డి, బళ్లాని వెంకట సత్యనారాయణ, బోగోలు సుదర్శనం, నాగేశ్వరరెడ్డి, శివయ్య, వంగాల నాగేశ్వరరెడ్డి, గోవిందు, గద్వాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

క్లుప్తంగా

కుమారస్వామికి షష్టి పూజలు


కుమారస్వామి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో గురు షష్టిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. అలాగే లోకకల్యాణం కోసం దేవస్థానం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవక్షం క్రింద వెలసిన దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలను నిర్వహించింది.

విద్యుత్ మోటారుకు మరమ్మతులు

పాములపాడు: మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఉన్న విద్యుత్ మోటారుకు సర్పంచు మేకల భాగ్యమ్మ గురువారం మరమ్మత్తులు చేయించారు. వేసవిలో కాలనీ వాసులు ఎక్కువగా వినియోగించడం వల్ల మోటారు కాలిపోయినట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ మోటారు వినియోగంలోకి వస్తే ఆ ఏరియాలోని కుటుంబాలకు నీటి సమస్య తీరుతుందని వివరించారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు భాస్కరరెడ్డి, నాగేశ్వరరావు కోరారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నర్సరీ, ఎల్‌కేజీ చదివే పిల్లలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఫీజులు వసూలు చేయడం దారుణమన్నారు. అర్హతలు లేని ఉపాధ్యాయుల చేత విద్యను బోధిస్తున్నారని, అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలను నడుపుతున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకునిరేత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు నాగన్న, రాజు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లను కొనసాగించాలి

మిడుతూరు: రేషన్ షాపుల డీలర్లను యథావిధిగా కొనసాగించాలని టీడీపీ నాయకులు సీతారామిరెడ్డి, బన్నూరు శ్రీనివాసరెడ్డి డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో కొంత మంది రేషన్ షాపుల డీలర్లపై ఒత్తిడి తీసుకువచ్చి రాజీనామాలు చేయించాలని యత్నిస్తున్నారని, అలా కాకుండా.. ప్రస్తుతం ఉన్న వారినే కొనసాగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తువ్వా అయ్యపురెడ్డి, అంకిరెడ్డి, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి


ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు వద్ద డీఈ విద్యాసాగర్

పాములపాడు: ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలని డీఈ ఆర్‌డబ్ల్యూఎస్ విద్యాసాగర్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలోని రెండు, క్రిష్టారావుపేట గ్రామంలో ఒక తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. తుమ్మలూరు గ్రామంలో ఆయన మాట్లాడుతూ తుమ్మలూరు గ్రామంలోని పాఠశాల ఆవరణలో ఉన్న ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించారు. తప్పని సరిగా ట్యాంకులు శుభ్రం చేసిన తేదీలను ప్రచురించాలని చెప్పారు. ఆయన వెంట సర్పంచు వరప్రసాద్, ఏఈ అనిల్, పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అశోక్ తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ఆత్మకూరు: మండలంలోని బాపునంతపురం గ్రామంలో గురువారం మండల వ్యవసాయాధికారులు మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు విస్తారంగా మొక్కజొన్న పంటను సాగుచేశారన్నారు. పంట వేసి నెలరోజులు అవుతుందని, ప్రస్తుతం పైరు ఏపుగా పెరిగే సమయంలో కత్తెర పురుగు ఆశిస్తోందని చెప్పారు. ఈ పురుగు ఆశిస్తే ప్రతి రైతు తప్పనిసరిగా హిమామ్‌మెక్టిన్ బెంజోయేట్ 80 మి.గ్రా. చొప్పున వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

బీజేపీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్‌గా మోమిన్ షబానా

ఆత్మకూరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు శ్రీశైలం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా మోమిన్‌షబానాను నియమిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం


మాట్లాడుతున్న అధ్యాపకురాలు డాక్టర్ ఎం.పద్మ

శ్రీశైలంప్రాజెక్ట్: మాదకద్రవ్యాల అలవాటు మనిషి జీవితాన్ని, కుటుంబ పరువును నాశనం చేస్తుందని అధ్యాపకురాలు డాక్టర్ ఎం.పద్మ అన్నారు. సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బుచ్చయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల అలవాటు సరదాగా మొదలై మనిషి జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.రాజన్న, డాక్టర్ శివనాగిరెడ్డి, ఎస్.మహేశ్వరరెడ్డి, బాలు, షాహీదాబేగం, కళ్యాణి, షష్మా తదితరులు పాల్గొన్నారు.

అధికారులే పింఛన్లను పంపిణీ చేయాలి

కొత్తపల్లి: గ్రామాల్లో ఉన్న పింఛన్ దారులకు జూలై నుంచి అధికారులే పింఛన్ పంపిణీ చేయాలని ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. గ్రామాల్లో ఉన్న పలు శాఖల అధికారులు, సచివాలయం అధికారులు కలిసి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. సోమవారం ఒకటో తేదీన ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల దాకా పింఛన్లను పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు.

వివాహిత అదృశ్యం

మహానంది: పుట్టుపల్లె గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వివాహితకు ఏడాది క్రితం పెళ్లి కాగా ప్రస్తుతం పుట్టింటికి వచ్చిందని చెప్పారు. రెండ్రోజుల నుంచి కనిపించలేదని ఆమె తండ్రి జయపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం సున్నిపెంటలోని ఏపీ జెన్‌కో అతిథిగృహ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సున్నిపెంట అభివృద్ధికి ఏఏ శాఖకు నిధులు, సిబ్బంది, మౌళిక సదుపాయాలు అవసరమో నివేదికలు ఇవ్వాలన్నారు. అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు కూడా చేయాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, ఆరోగ్య సేవలు, ప్రతి కుటుంబానికి ఉండడానికి ఇల్లు, ప్రభుత్వ పథకాలు పారదర్శంగా అందరికీ అందేలా ప్రతి అధికారి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ, తహసీల్దార్ గుర్రప్ప, ఐటీడీఏ ఈఈ లత, ప్రభుత్వ డాక్టర్ భూమా మహేశ్వరరెడ్డి, సీఐ రమేష్‌కుమార్, ఎస్ఐ గంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోండి


కబ్జాకు గురైన మున్సిపల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: కబ్జాకు గురైన మున్సిపాలిటీ స్థలాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య ఆదేశించారు. గురువారం పట్టణంలోని 16వ వార్డులో ముబారక్ షాదీఖానా సమీపంలో కబ్జాకు గురైన మున్సిపాలిటీకి సంబంధించిన 20 సెంట్ల స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆస్తులను కబ్జా చేస్తే తిరిగి అధికారులు చట్ట ప్రకారం స్వాధీనం చేసుకోవాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా ప్రభుత్వ ఆస్తులను వదలకుండా వెంచర్లు వేసి సొమ్ము చేసుకున్ని రూ.కోట్ల దండుకుంటున్నా అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట మున్సిపల్ టీపీఓ బాలమద్దయ్య, కౌన్సిలరు భాస్కరరెడ్డి, టీడీపీ నాయకులు ముర్తుజావలి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు

పాములపాడు: నేషనల్‌హైవే 340సీ పనుల్లో భాగంగా కూల్చిన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం మండలంలోని రుద్రవరం గ్రామంలో కూల్చిన పాఠశాల భవనాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఒకే గదిలో విద్యార్థులు ఉపాధ్యాయులు, మెటీరియల్, వంట సామగ్రితో పాటు ఇరుకు గదిలో 5 తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలో మరో చోట స్థలం సేకరించి నూతన భవన సముదాయం నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించారు.

చెంచు గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆసియామారుఫ్

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచు గిరిజనుల అభివృద్ధికి, గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రధానమంత్రి యోజనను పకడ్బందీగా అమలు చేస్తున్నాయని ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆసియా మారుఫ్, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చెంచుగిరిజన గర్భిణులకు స్కానింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే వైద్యాధికారులు సూచించిన ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మని ఇవ్వాలంటే తల్లి పౌష్టికాహారం బలంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ కె.కవిత, మత్తు వైద్యనిపుణురాలు, చిన్నపిల్లల వైద్యులు నాగరాజు, హెడ్ సిస్టర్ వసంతకుమారి, నర్సింగ్ ఆఫీసర్ సరోజినిదేవి తదితరులు పాల్గొన్నారు.

తంగడంచ ఫారం భూములను పేదలకు పంచాలి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం భూములను పేదలకు పంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. గురువారం వారు జూపాడుబంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయిన నీటిముంపు బాధిత కుటుంబాలకు, సెంటు స్థలం లేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఫారం భూములను పంపిణీ చేయాలన్నారు. 45 ఏళ్ల క్రితం వరకు తంగడంచ ఫారం నిరుపయోగంగా ఓ నీటికుంటలా ఉండేదన్నారు. ఆ భూములను తాటిపాడు, 80బన్నూరు, తంగడంచ, మండ్లెం, భాస్కరాపురం గ్రామాలకు చెందిన రైతులు తలా ఎకరం చొప్పున సాగుచేసుకుంటూ ఉండేవారన్నారు. 30ఏళ్ల క్రితం రైతుల నుంచి భూములు లాక్కొని తంగడంచ ఫారం ఏర్పాటుచేశారని తెలిపారు. 1997–98లో తంగడంచ ఫారం భూములను పంపిణీ చేయాలని వామపక్షపార్టీలు పెద్ద ఉద్యమం చేయగా అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు ఫారం భూములను పంపిణీ చేయటానికి అంగీకరించినప్పటికీ పంపిణీకి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏసన్న, సోమప్ప, రాము, లింగన్న, మాభాష, ప్రసాద్, నరసింహ తదతరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించండి


జూపాడుబంగ్లాలో అంగన్‌వాడీ వర్కర్లతో మాట్లాడుతున్న పీడీ నిర్మల

జూపాడుబంగ్లా: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని స్త్రీశిశుసంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల ఆదేశించారు. గురువారం పారుమంచాల, జూపాడుబంగ్లా, మండ్లెం గ్రామాల్లో పర్యటించారు. అంగన్‌వాడీ వర్కర్లతో మాట్లాడుతూ మెనూ ప్రకారం ప్రతి రోజూ రుచికరంగా, నాణ్యతగా మధ్యాహ్న భోజనం వండిపెట్టాలన్నారు. కాన్వెంట్లకు దీటుగా చిన్నారులకు పాఠాలు బోధించి వారిని తీర్చిదిద్దాలని సూచించారు. ప్రీస్కూల్ విద్యను అభ్యసిస్తున్న చిన్నారులను తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు.

కూల్చివేయనున్న అంగన్‌వాడీ, సచివాలయాల భవనాల పరిశీలన

నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా మండ్లెం గ్రామంలో కూల్చివేయనున్న నాల్గొవ అంగన్‌వాడీ కేంద్రం భవనం, నిర్మాణంలో ఉన్న నూతన సచివాలయ భవనాన్ని గురువారం ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి అంగన్‌వాడీ కేంద్రం సెంటు, నూతన సచివాలయం 2 సెంట్ల మేర కూల్చివేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అందుకుగాను నష్టపరిహారంగా అంగన్‌వాడీ కేంద్రం భవనానికి రూ.21.30లక్షలు, సచివాలయ భవనానికి రూ.15లక్షల మేర నిధులను నేషనల్‌హైవే అధికారులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మంజూరైన నిధులను వెచ్చించి నూతన అంగన్‌వాడీ భవనాన్ని నిర్మిస్తామన్నారు. సచివాలయానికి మంజూరయ్యే నిధులను ప్రభుత్వఖాతాకు జమచేయనున్నట్లు పీఆర్ ఏఈ బషీర్ తెలిపారు. అనంతరం మండలంలోని పారుమంచాల గ్రామంలో సమస్యాత్మకంగా మారిన అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం స్థలాన్ని పరిశీలించారు. సమస్యను పీడీ నిర్మల కలెక్టర్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. సీడీపీఓ మంగవల్లి, సూపర్‌వైజర్ పావనిరెడ్డి ఉన్నారు.

బైర్లూటీలో పారిశుద్ధ్య పనులు

ఆత్మకూరు: బైర్లూటీ చెంచుగూడెంలో గురువారం పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటీ వైద్యాధికారి పవన్ కుమార్ అవగాహన కల్పించారు. వర్షాకాలం ముగిసేంతవరకు మంచినీటిని వేడి చేసి చల్లార్చి తాగాలన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమణమ్మ, విశ్వనాథం, భాస్కర్, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ గురువారం తెలిపారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారుఫ్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

వేలాల్లో పెరిగిన ఆదాయం

మహానంది: బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన 41.06 ఎకరాలకు గురువారం నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా భారీగా ఆదాయం లభించినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. గతేడాది రూ.9,08,000 రాగా ప్రస్తుతం రూ. 12,97,000 వచ్చిందని, గతంలో కంటే ఈ ఏడాది రూ. 3,89,000 అదనంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు. దీంతో పాటు ఓంకారం దేవస్థానానికి చెందిన 7.60 ఎకరాల భూముల ద్వారా గతేడాది రూ. 1,64,000 రాగా ప్రస్తుతం రూ. 2,15,000 వచ్చిందని చెప్పారు. దీంతో ఈ ఏడాది రూ. 51,000 అదనంగా ఆదాయం సమకూరిందని తెలిపారు. జీసీ పాలెం గ్రామంలోని శ్రీ చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన 20.12 ఎకరాల భూములకు రూ. 6,25,000 వచ్చినట్లు చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ. 27వేలు అదనంగా ఆదాయం వచ్చిందని ఈఓ స్వర్ణముఖి తెలిపారు.

కురువల సమస్యలు పరిష్కరించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రంలో కురువ కులస్తుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని గురువారం సున్నిపెంటలో కురువలు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కోరారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న కురువలను అన్నిరంగాల్లో ముందుకు తీసుకుపోయే దిశగా ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా నాయకులు ఎంకె.రంగస్వామి, పెద్దపాడు ధనుంజయ, కె.దేవేంద్ర, అల్లూరు.వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అందరి గుడి ప్రభుత్వ బడి


విద్యార్థులతో పాటు ర్యాలీ చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాములపాడు: మనందరి పాలిట గుడి ప్రభుత్వ బడి అని హెచ్‌ఎం కృష్ణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల వసతులు, పౌష్టికాహారం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఉచితంగా అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. గ్రామంలోని పుర వీధుల గుండా నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, రంగారెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


యర్రగుంట్లలో విద్యార్థుల మానవహారం

యర్రగుంట్లలో ‘నేను బడికిపోతా’

మహానంది: బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని బండిఆత్మకూరు మండల విద్యాశాఖాధికారులు మోహన్‌రెడ్డి, యశోద తెలిపారు. గురువారం బండిఆత్మకూరులోని యర్రగుంట్లలో నేను బడికి పోతా, విద్యాప్రవేశం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మానవహారం నిర్వహించి పాఠశాలలో చేరితే వచ్చే లాభాలు, విద్యనభ్యసించే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ఆర్బీకేలో స్టాకు రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏడీఏ

కొత్తపల్లి: విత్తనాల దుకాణదారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లి, గువ్వలకుంట్ల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆర్బీకేల్లో నిలువ ఉన్న ఎరువులను, స్టాకు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం రైతులతో చర్చించి ప్రస్తుత పంట స్థితిగతులను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచుతామని, రైతులు ఎటువంటి ఇబ్బంది పడవలసిన అవసరం లేదని తెలిపారు. గ్రామాల్లో ఉన్న పొలాలను కౌలుకు తీసుకున్న రైతులు రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మహేష్, వీఆర్వో చంద్రశేఖర్, వీఏఏలు జహీద్ ,చరణ్ లు పాల్గొన్నారు.

యోగాతో ఎంతో ప్రయోజనం

ఆత్మకూరు: విద్యార్థులకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ లీలావతి అన్నారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ దినోత్సవం, యోగాడే సందర్భంగా యోగా సాధన చేయించారు. ఆమె మాట్లాడుతూ యోగాలో ప్రాణాయామం చేయడం ద్వారా టీబీ రాకుండా నివారించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణంపై కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు సూర్యకుమారి, రమాదేవి, కోమల, శివకుమారి, కవిత, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, మంజుల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కుళాయిల వద్ద మురుగు కుంటలు లేకుండా చూడాలి

కొత్తపల్లి: గ్రామాలలో కుళాయిల వద్ద మురుగు కుంటలు, గుంతలు లేకుండా సర్పంచులు, అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ జవహర్ బాబు ఆదేశించారు. గురువారం గువ్వలకుంట్ల గ్రామ సచివాలయం పరిధిలోని జి.వీరాపురం గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామంలో మురుగు నీరు నిలువ, కుళాయి కనెక్షన్లు పరిశీలించారు. అలాగే మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చాందిని, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాండు నాయక్ ఉన్నారు.